క్లుప్తంగా

లడ్డూ వివాదంలో నిజాలను నిగ్గు తేల్చాలి

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిపై వస్తున్న ఆరోపణలపై నిజానిజాలను నిగ్గు తేల్చాలని చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్ పేర్కొన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై వచ్చిన ఆరోపణలపై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం దీనిపై థర్డ్ పార్టీతో విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలి

- టీయూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, రఘునందన్‌రెడ్డి
- సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న మల్లారెడ్డి, రఘునందన్‌రెడ్డి

శంకర్‌పల్లి: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలని టీయూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, రఘునందన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల టీయూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర నాయకుల సమక్షంలో వారు ప్రమాణ స్వీకారం చేశారు. మండల అధ్యక్షుడిగా అంజయ్య, కార్యదర్శిగా శ్రీనివాస్ చారిని ఎన్నుకున్నారు. అనంతరం మల్లారెడ్డి, రఘునందన్ రెడ్డి నూతన కార్యవర్గాన్ని సన్మానించి, వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడాలని వారు కోరారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



కొరటాల శివతో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రెండురోజులుగా తీర్థ యాత్రలో ఉన్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం ఆయన సినీ రచయిత కొరటాల శివ, నియోజకవర్గం నాయకులతో కలిసి తిరుమల తిరుపతిలో ఉదయం స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. రెండురోజుల యాత్రలో భాగంగా ఆయన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేసి, తిరుపతిలో శ్రీవారిని దర్శించుకున్నారు. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసినట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

తాళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన లెనిన్ రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలని తాళ్లపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను విద్యుత్‌శాఖ ఉద్యోగి, శేరిలింగంపల్లి ప్రధాన కార్యదర్శి లెనిన్ రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పేద విద్యార్థుల అవసరాలను దాతలు గుర్తించి సహాయం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పీడీ భిక్షపతి, ఉపాధ్యాయులు కిరణ్మయి, సంగమేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, గ్లోరి, శోభారాణి, మంజుల, లలిత, సీతాబాయి, మొగులయ్య, బాలక్రిష్ణ, దుర్గాభవానీ, యూ సుఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి పశువుల పోషణ లాభదాయకం

కొందుర్గు: పాడి పశువులను పెంచుకోవడం ఎంతో లాభదాయకమని హెరిటేజ్ డెయిరీ ప్రతినిధి అనుపమ సూచించారు. శనివారం పర్వతాపూర్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతిని నష్టాలపాలవుతున్నారన్నారు. రైతులు వ్యవసాయంతోపాటు పాడి పశువులను పెంచుకోవడంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఏరియా మేనేజర్ వెంకటేశం, ప్లాంట్ మేనేజర్ రాఘవేందర్, సూపర్‌వైజర్ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా..?

- పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయించాలి
- పంపిణీకి అర్హుల ఎదురు చూపులు
- అజీజ్‌నగర్ లబ్ధిదారుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



పంపిణీ చేయని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు



అర్ధంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్ల పనులు

మొయినాబాద్ రూరల్: నియోజకవర్గంలోని అజీజ్‌నగర్‌లో పూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ విషయంలో అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పూర్తయిన ఇండ్లను నేటికీ పంపిణీ చేయలేదు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. పేదోడి సొంతింటి కల కలగానే మిగలనుందా? అని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకం ద్వారా పూర్తయిన ఇండ్లను మండలంలో ఏ ఒక్కరికీ పంపిణీ చేయలేదు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు మూడు బ్లాక్‌లలో 40 నిర్మించారు. ఈ ఇళ్లను అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని పోలీస్ అకాడమీ సమీపంలో మూడు బ్లాక్‌లలో పూర్తి చేశారు. అప్పట్లో ఇళ్ల పంపిణీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కేవలం అజీజ్‌నగర్ గ్రామస్తులకే ఇవ్వాలని లబ్ధిదారులు కోరడంతో 40 ఇండ్లకు గాను 872 దరఖాస్తులు వచ్చాయి. అప్పటి రెవెన్యూ పంచాయతీ అధికారులు గ్రామంలో అర్హులైన వారిని గుర్తించేందుకు ఇంటింటికి తిరిగి పరిశీలించారు. అందులో 94 మందిని ఈ పథకానికి అర్హులుగా ఎంపిక చేశారు. 40 ఇండ్లకు గాను 94 మంది అర్హులు ఉండగా అప్పటి ప్రజా ప్రతినిధులు అర్హుల సమక్షంలో లక్కీ డ్రా తీసి 40 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసి సంవత్సరం గడిచినా నేటికీ ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదు. దీంతో కట్టిన ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు, నిధుల దుర్వినియోగానికి ఇలాంటి కార్యక్రమాలే మచ్చుతునకలని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సత్వరమే స్పందించి లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ చేయాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



పేదల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గత ప్రభుత్వంలో నిర్మించారు. అర్హులైన వారిని గుర్తించి 40 ఇండ్లకు లక్కీ డ్రా తీసి పంపిణీ చేయాలన్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పట్టించుకునే వారు లేకపోవడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీలో జాప్యం జరుగుతుంది. – మాణిక్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ

త్వరగా పంపిణీ చేయాలి



అజీజ్‌నగర్‌లో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను త్వరగా పంపిణీ చేయాలి. పది సంవత్సరాల నుంచి సొంతింటి కోసం ఎదురు చూస్తున్నాం. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవాలి. – సుశీల, అజీజ్‌నగర్

చిన్న చిన్న పనులు పూర్తిచేయాలి



గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో టాయిలెట్స్, బాత్‌రూమ్స్‌తో పాటు నల్లా కనెక్షన్లు, సెప్టిక్ ట్యాంకులు లేకపోవడంతో పంపిణీ చేయలేదు. మిగిలిన పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం. – విజయ్‌కుమార్, డిప్యూటీ డీఈ, మొయినాబాద్



పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న లక్ష్మీనారాయణ

వికసిత్ భారత్ బీజేపీ లక్ష్యం

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: వికసిత్ భారత్ బీజేపీ లక్ష్యమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ బీజేపీయేనని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం కోసం ప్రధాని అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో భారత్‌దేశాన్ని ప్రపంచంలో ఆర్థికంగా, అభివృద్ధి చెందిన దేశంగా చూడాలన్న లక్ష్యంతో ప్రధాని ముందుకు సాగుతున్నారన్నారు. దేశం మీద, మట్టి మీద ప్రేమతో ప్రతిఒక్కరూ బీజేపీ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదును ఉద్యమంలా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మదన్‌మోహన్, మనోహర్‌రెడ్డి, వంశీకృష్ణ, వెంకటేష్, మురళీ, లక్ష్మీకాంత్‌రెడ్డి, మోటె శ్రీను, రుషికేష్, చెట్ల వెంకటేష్, మాణిక్యం, దొడల వెంకటేష్, రఘురాంగౌడ్, కుర్మయ్య, మహేందర్‌రెడ్డి, సురేష్, కృష్ణయ్య, శ్రీశైలం, రవి, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి లోక్ అదాలత్

- ట్రాఫిక్ కేసులను సకాలంలో పరిష్కరించుకోవాలి
- చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం



సీఐ వెంకటేశం

చేవెళ్ల: ఈ నెల 23వ తేదీ నుంచి 28వరకు చేవెళ్ల కోర్టు ఆవరణలో ట్రాఫిక్ కేసులపై లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొకిల, షాబాద్ మండలాల పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో తక్కువ జరిమానాతో కేసులు పరిష్కరిస్తారని చెప్పారు. కేసులు నమోదైన వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



షాద్‌నగర్ రూరల్: మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు



షాబాద్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

- ఘనంగా మిలాద్ ఉన్ నబీ

షాద్‌నగర్ రూరల్: మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ జామే మసీదులో ఇమామ్ సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అజారుద్దీన్ హాఫెజ్ ఆధ్వర్యంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి, సహనానికి, సఖ్యతకు ఆయన బోధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు సయ్యద్ రిజ్వాన్‌పాషాఖాద్రీ, మున్నవర్‌అలీ హాఫేజ్, ఖాజీ సయ్యద్, యూసుఫ్‌అలీ, అజాహర్ ఎత్తేశామ్, హాఫేజ్, షోయబ్ అత్తారిహాఫేజ్, మసీద్ కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో...

షాబాద్: మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జయంతి పురస్కరించుకొని ప్రతి ఏడాది మిలాద్ ఉన్ నబీ పెద్ద ఎత్తున జరుపుకున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ పండుగలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం మజ్జిగ, శీతల పానీయాలు, పండ్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త బోధించిన శాంతి మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్, అఫ్జల్, ఇమ్రాన్, ఇబ్రహీం, షాఫీ, ముఖ్రమ్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

చేవెళ్ల: ఈ నెల 22న దేవునిఎర్రవల్లిలో టీం విమలాకర్ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత జీఐ కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విమలాకర్‌రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో ఎస్ఎల్వీ కన్వెన్షన్‌లో ఆదివారం ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకూ ఈ వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పాఠశాలల అభివృద్ధికి కృషి

- అమెజాన్ సెక్యూరిటీ హెడ్ జాన్



విద్యార్థులతో అమెజాన్ సర్వీసెస్ ఇన్‌కమ్యూనిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పూజిత తదితరులు

షాబాద్: అంగన్‌వాడీ పాఠశాలల అభివృద్ధికి అమెజాన్ సంస్థ కృషి చేస్తుందని సెక్యూరిటీ హెడ్ జాన్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ పాఠశాల భవనాన్ని అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్ పూజిత శ్రీనివాస్‌గౌడ్, అమెజాన్ డేటా సెంటర్ హెడ్ శంకరన్, తాతాజీ, కృష్ణచైతన్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకరిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకుంటేనే మానసికంగా, శారీకంగా అవృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్వీసెస్ ఇన్‌కమ్యూనిటీ సీఈఓ పార్థసారథి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సృజన, టీచర్ మంజుల, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయండి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు కందవాడ గ్రామస్తుల వినతి



వినతి పత్రం ఇస్తున్న కందవాడ మాజీ ఉప సర్పంచ్ కావ్య, కృష్ణాగౌడ్ తదితరులు

చేవెళ్ల: కందవాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయాలని శుక్రవారం చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్‌ను మాజీ ఉప సర్పంచ్, బీజేపీ జిల్లా మహిళా కార్యదర్శి గౌండ్ల కావ్యగౌడ్, చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్‌లు గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందవాడతోపాటు గుండాల, లక్ష్మిగూడ, సాయిరెడ్డిగూడ, నారాయణగూడ, మల్లారెడ్డిగూడ, పలుగుట్ట, ఎర్నో కొటాల గ్రామాల్లో కలిపి దాదాపు 20వేల మంది జనాభా ఉంటుందని తెలిపారు. మండల ఆరోగ్యకేంద్రం ఆలూరులో ఉండటంతో గర్భిణులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆలూరు ఆరోగ్య కేంద్రం దూరంగా ఉండడంతో గ్రామస్తులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి కందవాడ గ్రామంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనికి స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నూతన పాలకమండలి సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఆలయాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు పాలక మండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో ఎలకట్ట గ్రామ శివారులోని అంబభవానీ మాత, హనుమాన్ దేవాలయాల నూతన పాలక వర్గాల ప్రమాణస్వీకారోత్సవాన్ని దేవాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబ భవానీ మాత దేవాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందన్నారు. పాలకవర్గం సభ్యులు ప్రతి నెల సమావేశాన్ని నిర్వహించి, ఆలయ అభివృద్ధికోసం తగిన చర్యలు చేపట్టాలన్నారు.

పాలక మండలి సభ్యులు...

అంబ భవానీ మాత దేవాలయం నూతన చైర్మన్‌గా ముత్యాల రాజు, డైరెక్టర్లుగా ఆంజనేయులుగౌడ్, వెంకట్‌రాంరెడ్డి, నరేశ్ యాదవ్, శివ, కుమార్, అమృత, భవానీ శంకర్, హనుమాన్ దేవాలయ నూతన కమిటీ చైర్మన్‌గా నారం దినేష్‌రెడ్డి, డైరెక్టర్లుగా యాదగిరి, రమేష్, శ్రీనివాస్, నర్సమ్మలు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకవర్గం సభ్యులకు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కావలి శ్రీశైలం, రాజు, గున్న భీమయ్య, శ్రీపాద్ రెడ్డి, నారం పెంటారెడ్డి, బాబా అలీ, వీరేశం, ఆలయ ఈఓ శివకుమార్, ఎండోమెంట్ ఆర్ఐ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలంలో లడ్డూ కైవసం చేసుకున్న ఎమ్మెల్యే



నందిగామ: లడ్డూ ప్రసాదంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు



మొయినాబాద్ రూరల్: కేతిరెడ్డిపల్లిలో లడ్డూతో దారెడ్డి చంద్రారెడ్డి



షాద్‌నగర్: వేలంలో లడ్డూ దక్కించుకున్న మాజీ సర్పంచ్ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి

నందిగామ: వీర్లపల్లిలో వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం రాత్రి వేలంలో రూ. 1,11,111లకు కైవసం చేసుకున్నా రు. షాద్‌నగర్ ఎమ్మెల్యే సొంత గ్రామమైన నందిగామ మండలం వీర్లపల్లిలో కొన్ని రోజులుగా వినాయ కుడికి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమానికి వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిందం నర్సింహా, నవాజ్ రెడ్డి, చంద్రశేఖర్, రఘు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిపల్లిలో...

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్, కాశింబౌలి, హిమాయత్‌నగర్, తోల్‌కట్ట, చిన్నమంగళారం, కేతిరెడ్డిపల్లి ఆయా గ్రామాల్లో భక్తులు ఏర్పాటు చేసిన వినాయకులను శుక్రవారం కూడా నిమజ్జనానికి తరలించారు. కేతిరెడ్డిపల్లిలో గణనాథుడి లడ్డూను వేలంలో దారెడ్డి చంద్రారెడ్డి రూ. 3.15 లక్షలకు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి చంద్రారెడ్డిని సన్మానించి లడ్డూ సమర్పించారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, సిద్ధయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, శివారెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో మాజీ సర్పంచ్ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి పద్మ దంపతులు పాల్గొని రూ.1,51,000వేలకు లడ్డూ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారిని ఘనంగా సన్మానించారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

- మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

మొయినాబాద్ రూరల్: ప్రతిఒక్కరికి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరమని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. ఎన్కెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవ వారోత్సవాల్లో భాగంగా పారిశుద్ధ్యంపై విద్యార్థులకు క్రీడా పోటీలు, వ్యాసరచన నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి ఆమె బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సంధ్య మాట్లాడుతూ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

షాబాద్: స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలు పక్కాగా నిర్వహించాలని షాబాద్ ఎంపీఓ శ్రీనివాస్, పోతుగల్ పంచాయతీ కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.



షాద్‌నగర్ రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మానవ హారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



మొయినాబాద్ రూరల్: బహుమతులు ప్రదానం చేస్తున్న సంధ్య



షాబాద్: పోతుగల్ గ్రామంలో ర్యాలీలో అశోక్, శ్రీనివాస్, విద్యార్థులు